మాదాపూర్ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగి ఆహ్లాదం పంచుతున్న హరితహారం చెట్లు

ఆహ్లాదం పంచుతున్న హరితహారం చెట్లు

కోరుట్ల పట్టణ శివారులోని మాదాపూర్ రోడ్డు కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా బీఆర్ఎస్ హయాంలో ఆరేళ్ల క్రితం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. బాటసారులు, వాహనదారులకు నీడను అందిస్తున్నాయి.

-కోరుట్ల, సెప్టెంబర్ 29

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం చైర్మన్, నాయకులు, సభ్యులు

- కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు
- బీర్‌పూర్ సహకార సంఘ సర్వసభ్య సమావేశం

సారంగాపూర్, సెప్టెంబర్ 29: సహకార సంఘ అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని కేడీసీసీబీ డైరెక్టర్, బీర్‌పూర్ సహకార సంఘం అధ్యక్షుడు ముప్పాల రాంచందర్ రావు కోరారు. బీర్‌పూర్ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘ చైర్మన్ ముప్పాల రాంచచందర్ రావు మాట్లాడుతూ, రైతులు తీసుకుంటున్న స్వల్ప, దీర్ఘ కాలిక రుణాలు సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సహకార సంఘంలో డిపాజిట్లు చేయాలని కోరారు. 2023–24 వార్షిక నివేదిక, ఆదాయవ్యయాల వివరాలను చదివి వినిపించారు. సమావేశంలో రెండు లక్షల పంట రుణం ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులకు మాఫీ చేయాలని తీర్మానం చేశారు. అనంతరం సహకార సంఘ కార్యాలయ వాచ్‌మెన్ శీలం రాజయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి సహకార సంఘం ద్వారా రూ. 5వేలు అందజేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, సహకార సంఘం వైస్ చైర్మన్ కొమురెల్లి, నాయకులు గుడిసే జితేందర్ యాదవ్, రాజేశం, కార్యదర్శి అయ్యోరి తిరుపతి, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కోరుట్ల, సెప్టెంబర్ 29: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మినీ స్టేడియంలో కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 14, 16, 18, 20 ఏళ్ల విభాగంలో బాలబాలికలకు రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, వాకింగ్ రేస్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 820 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ ముత్తయ్య రెడ్డి తెలిపారు. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

రాయికల్, సెప్టెంబర్ 29: రాయికల్ ఎస్ఐగా సీహెచ్ సుధీర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎస్ఐ అశోక్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పోలీసు శాఖ సస్పెండ్ చేయగా, ఆయన స్థానంలో జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుధీర్‌రావును రాయికల్‌కు బదిలీ చేయగా, ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐకి పోలీసులు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డ్రా పద్ధతిలో కోడెల పంపిణీ

సారంగాపూర్, సెప్టెంబర్ 29: మండలంలోని పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కోడెలను డ్రా పద్ధతిలో రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని ఆలయ ఈవో కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో భక్తులు కానుకగా ఇచ్చిన 12 చిన్న కోడెలు ఉండగా, పెంచుకునే ఆసక్తి ఉన్న రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల రైతుల పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఆలయానికి రావాలని తెలిపారు. రైతుల సమక్షంలోనే డ్రా తీస్తామని పేర్కొన్నారు.

ముగ్గురికి దేహశుద్ధి

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 29: జగిత్యాలలో చెద్దర్లు అమ్మేందుకు వచ్చి ఓ ఇంట్లోకి చొరబడ్డ ముగ్గురికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బ్లాంకెట్స్ కొనాలంటూ ముగ్గురు వ్యక్తులు ఆదివారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు వచ్చి ఓ మహిళ ఇంట్లోకి చొరబడ్డారు. మహిళ కేకలు వేయగా, చుట్టుపక్కల వారు వచ్చి ముగ్గురిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో చోరీ

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 29: జిల్లా కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి చెందిన ముసిపట్ల ఆంజనేయులు ఇటీవల మృతిచెందగా, కుటుంబ సభ్యులు శనివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి నిద్రకు వెళ్లారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో భద్రపరిచిన రూ. 50వేల నగదు, రెండు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కూడా కట్ చేశారు. టౌన్ పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారు. బాధితుడు ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపారు.

లింగాపూర్ సమీపంలోని ఆలుగొర్రె వద్ద వరదలకు దెబ్బ తిన్న కల్వర్టు

దెబ్బ తిన్న కల్వర్టు.. రాకపోకలకు ఇక్కట్లు

పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామ సమీపంలోని ఆలుగొర్రె వద్ద గల లో–లెవల్ కల్వర్టు ఇటీవల వచ్చిన వరదలకు సిమెంట్ కొట్టుకుపోయి, పెద్ద గుంత పడింది. దీంతో రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని లింగాపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

-పెగడపల్లి, సెప్టెంబర్ 29

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

మల్యాల: రామన్నపేటలో మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి

మల్యాల, సెప్టెంబర్ 29: అర్హులైన రైతులందరికీ రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని, దొడ్డు, సన్న రకాలకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, పోతారం సహకార సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు తెలిపారు. మల్యాల మండలం రామన్నపేట, పోతారం, రాంపూర్, ఓగులాపూర్ రైతులతో ఆదివారం వారు సమావేశమయ్యారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సామ రవీందర్‌రెడ్డి, క్యాతం భూపతిరెడ్డి, నల్ల తిరుమల్‌రెడ్డి, ఏలేటి రాజిరెడ్డి, గాండ్ల లచ్చన్న, అల్లూరి ఆదిరెడ్డి, గడ్డం మల్లారెడ్డి, కేతిరెడ్డి తిరుపతిరెడ్డి, వేముల కర్ణాకర్, బందెల మల్లయ్య, ఐలాపురం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, సెప్టెంబర్ 29 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మేడిపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఆయన రైతు ఐక్య వేదిక నాయకులతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 4న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పార్టీలకతీతంగా రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు ఎస్ ఎన్‌రెడ్డి, గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, సెప్టెంబర్ 29: కొడిమ్యాలలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 4న చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, రైతు ఐక్య వేదిక నాయకులు ఏలేటి నర్సింహారెడ్డి, డబ్బు గౌతంరెడ్డి, రేకులపల్లి తిరుపతిరెడ్డి, సురబీ సాగర్‌రావు, బండ నర్సింహారెడ్డి, కడారి రఘుపతిరెడ్డి, వెంకటన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలిక మృతి

రాయికల్, సెప్టెంబర్ 29: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన తాలుక మనీష (12) జ్వరంతో శనివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మనీషకు రెండు రోజుల క్రితం జ్వరం రాగా, కుటుంబసభ్యులు జగిత్యాలలోని ఓ దవాఖానలో చేర్పించారు. జ్వరం తీవ్రం కావడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.

రైతు భరోసా అందించాలి

మల్లాపూర్, సెప్టెంబర్ 29: పంటలు కోత దశకు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు విడుదల చేయకపోవడం సరికాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో చాలా మంది రైతులు పంట రుణమాఫీ కాకపోవడంతో పాటు పెట్టుబడి సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని కోరారు.

పేదలకు కంటి శస్త్ర చికిత్సలు

శస్త్ర చికిత్స చేసిన వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, సెప్టెంబర్ 29: పట్టణంలోని పావని కంటి దవాఖానలో ఆపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 11 మంది పేదలకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, స్వామి రెడ్డి, దవాఖాన సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 29: జగిత్యాల మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు మారంపల్లి పోచయ్య వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి 9వ వార్డు జానకీరామ్ హౌసింగ్ సొసైటీ బోర్డు కాలనీ సభ్యులు ఆదివారం రూ. 33,600 నగదు అందజేశారు. పోచయ్య 15 సంవత్సరాలుగా హౌసింగ్‌బోర్డు కాలనీలో పారిశుద్ధ్య కార్మికుడిగా సేవలందించారని కొనియాడారు. ఇక్కడ కౌన్సిలర్ శ్రీలత– రామ్మోహన్ రావు, గాలిపెల్లి నర్సయ్య, సత్యారావు, బోయినిపెల్లి ప్రసాద్ రావు, శ్రీనివాస్ యాదవ్, తదితరులున్నారు.

పద్మశాలీ సంఘం మండల కార్యవర్గం

సారంగాపూర్: ఎన్నికైన పద్మశాలీ సంఘం సభ్యులు

సారంగాపూర్, సెప్టెంబర్ 29: బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం మండల పద్మశాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆడెపు రవికుమార్, గౌరవాధ్యక్షుడిగా మెరుగు రాజేశం, ఉపాధ్యక్షులుగా చెట్‌పెల్లి సత్యనారాయణ, ఎనగందుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బోగ సత్తన్న, కోశాధికారిగా మెరుగు గంగాధర్‌తో పాటు పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మండలంలోని పద్మశాలీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూమేశ్వర్

హన్మంతు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 29: జగిత్యాలలోని దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మొనుగూరి హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్, ఉపాధ్యక్షులుగా రాచర్ల సురేశ్, రామిల్ల రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా మంతెన రాజు, గోడ రాజయ్య, కోశాధికారిగా బొల్లె లక్ష్మీరాజం, కార్యవర్గ సభ్యులుగా ఇరుగురాల శ్రీనివాస్, సుంకె ప్రకాశ్, యంతెన స్వామి, బరిగల సురేశ్, చిలుముల మైసయ్య, గుండు నారాయణ, లింగంపల్లి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు రాజయ్య, శ్రీను పాల్గొన్నారు.

రాయికల్, సెప్టెంబర్ 29: పట్టణంలో ఆదివారం గౌడ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనుగందుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పొన్నం శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారిగా బండి ప్రవీణ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మొగిపాక మహేశ్, బైరం స్వామి, పెగ్గెర్ల నారాయణ, వల్లకొండ మహేశ్, నరేశ్, శ్రీనివాస్‌గౌడ్ వ్యవహరించారు.

మేడిపల్లి, సెప్టెంబర్ 29: రైతు ఐక్యవేదిక మేడిపల్లి మండల కన్వీనర్‌గా చిలివేరి తిరుపతి, భీమారం మండల కన్వీనర్‌గా ఉదగిరి ఆదిరెడ్డిని నియమించినట్లు రైతు ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ నల్ల రమేశ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వీరి నియామకంపై రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కో–కన్వీనర్ మిట్టపల్లి తిరుపతిరెడ్డి, రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు వేముల కరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల, సెప్టెంబర్ 29: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థి శ్రీనిధి వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పుట్ బాల్ పోటీలకు ఎంపికైంది. జ్యోతిని పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 29: కరీంనగర్ జిల్లా మానకొండూర్ గ్రామానికి చెందిన అనాథ చిన్నారులు కొండ్ర ప్రహర్ష, కళ్యాణ్‌కు జగిత్యాల పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు సూరజ్ శివశంకర్ ఆదివారం రూ. 10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, అనాథ చిన్నారులకు తమవంతు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడంలో విఫలం

కలెక్టరేట్, సెప్టెంబర్ 29 : 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను రెండు నెలల క్రితమే తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం, వారికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడంలో విఫలమైందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు శారదాదేవి విమర్శించారు. ఆదివారం నగరంలోని భగత్‌నగర్‌లో గల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగ విరమణ ప్రయోజనాల ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు.

బ్రాహ్మణులకు సత్కారం

బ్రాహ్మణులను సన్మానిస్తున్న బృందావనం రిసార్ట్ అధినేత కొండల్‌రావు

కొడిమ్యాల, సెప్టెంబర్ 29: మండలంలోని నాచుపల్లిలో గల బృందావనం రిసార్టులో ఆదివారం వివిధ జిల్లాలకు చెందిన బ్రాహ్మణులకు రిసార్ట్ అధినేత కొండల్‌రావు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల బ్రాహ్మణులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పరిసరాల్లో శ్రమదానం

రైల్వే స్టేషన్ ఆవరణలో చెత్తాచెదారం తొలగిస్తున్న యువకులు

కోరుట్ల, సెప్టెంబర్ 29: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక యువకులు రైల్వే స్టేషన్ పరిసరాల్లో శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ గోనెల మహేశ్, రమేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండాలి

- తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మారుతీనగర్, సెప్టెంబర్ 29: ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాజేశ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జగిత్యాల పట్టణాధ్యక్షుడు ఊటూరి నవీన్‌కుమార్, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో చోరీ

కథలాపూర్, సెప్టెంబర్ 29: కలికోట గ్రామ శివారులో గల సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లి వెనుకవైపు పడేసినట్లు చెప్పారు. చోరీ చేసిన వ్యక్తి ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైనట్లు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మేడిపల్లి, సెప్టెంబర్ 29: భీమారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బండపల్లి అభిషేక్, బోయిని హర్షిత్, చిలువేరి రుచిత, పల్లికొండ కీర్తన, పుప్పాల రచన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేశ్ ఆదివారం తెలిపారు. విద్యార్థులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఎంసీ చైర్‌పర్సన్ డిండిగాల లావణ్య, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీధర్, నజీమా, సాహెబా, అప్సర్, నరేందర్, జయశ్రీ, రమేశ్, నీలిమ, సంధ్యారాణి, నాయకులు రఘు, రాజు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సాధించిన పతకాలతో విద్యార్థులు

జగిత్యాల, సెప్టెంబర్ 29: ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీల్లో జగిత్యాలకు చెందిన శ్రీజ గోల్డ్ మెడల్, ప్రవీణ్‌కుమార్ సిల్వర్, సంతోష్‌కుమార్, అరుణ్ కుమార్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. విద్యార్థులను షోటోకాన్ జపాన్ కరాటే డో ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ రచ్చ శీనుబాబు, కోచ్ అరుముళ్ల పవన్ అభినందించారు.

విద్యార్థులకు అభినందన

సాధించిన పతకాలతో విద్యార్థులు

కొడిమ్యాల, సెప్టెంబర్ 29: మండలంలోని చెప్యాలకు చెందిన పులి ప్రణీత్, గుంటుక రాహుల్, కానవేని మేఘన, జిడిగె వివేక్, బరిగె దీపిక, బరిగె దీక్షిత్, పిల్లి తనీష్, అబ్దుల్ ఖలీద్, నాలా మల్లికార్జున్, గంగాధర శ్రీనివాస్ నిర్మల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. విద్యార్థులతో పాటు కోచ్ బరిగె లక్ష్మిరాజంను పలువురు అభినందించారు.

మానసిక ఒత్తిడితోనే గుండె వ్యాధులు

విద్యానగర్, సెప్టెంబర్ 29: పాశ్చాత్య దేశాల్లో 40 ఏళ్లు దాటిన వారిలో గుండె సంబంధ సమస్యలు వస్తుండగా మనదేశంలో మాత్రం 30 ఏళ్లకే గుండెపోటుకు గురవడం ఆందోళన కలిగిస్తున్నదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో హార్ట్ వాక్ నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ నుంచి ఎస్సారార్ కళాశాల వరకు నిర్వహించిన హార్ట్ వాక్‌ను డీఎంహెచ్‌వో సుజాత ప్రారంభించగా, 1000 మంది వాక్‌లో పాల్గొన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మనల్ని నడిపించే గుండె మనం నడవడం వల్ల ఆరోగ్యంగా ఉంటుందని.. అందుకోసం ప్రతిరోజూ అరగంట పాటు వాకింగ్ చేసి గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

దాడి చేసిన వారిపై కేసు

సారంగాపూర్, సెప్టెంబర్ 29: రేచపల్లిలో దాడి చేసి గాయపరిచిన వారిపై ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రేచపల్లి గ్రామానికి చెందిన తాటి జగన్–నీరజ దంపతులు ఇంటి వద్ద ఉండగా డబ్బుల విషయమై నెల కొన్న వివాదంలో మల్యాల రాయమల్లు, మద్రి గంగన్న, మల్యాల మల్లవ్వ, మద్రి రాజవ్వ, సాంబ మానస దాడి చేయగా గాయాలైనట్లు తెలిపారు. తాటి జగన్ ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దత్తాద్రి పేర్కొన్నారు.

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 29: జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతి–లక్ష్మి దంపతులకు అదే గ్రామానికి చెందిన సిగిరి పద్మతో ఇంటి ఆస్తికి సంబంధించి గొడవలు జరుగుతున్నాయి. దీనిని మనసులో పెట్టుకొని పద్మ భర్త సాయిలుపై ఇద్దరు గడ్డపారతో దాడి చేశారు. సిగిరి పద్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎడ్మల జితేందర్‌రెడ్డి అతిగా మద్యం సేవించి విధులకు ఆటంకం కలిగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పదవుల కేటాయింపులో అందరికీ సముచిత స్థానం

గంగాధర, సెప్టెంబర్ 29: గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పదవులు కేటాయిస్తూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనదైన మార్కును చూపించారని మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు మంత్రి లత ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన మార్కెట్ కమిటీ పదవులతో పాటు పార్టీ పదవుల్లో 24 ఏండ్ల యువకుల నుంచి 84 ఏండ్ల సీనియర్ల వరకు అందరికీ సముచిత స్థానం కల్పించి కార్యకర్తలపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని కొనియాడారు. అంతే కాకుండా నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాతినిథ్యం కల్పించిన సందర్భంగా ఎమ్మెల్యే సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో, TEAM-LEADERSగా జగిత్యాల మరియు చుట్టు ప్రక్క ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q: 10th ఆపైన. సెల్: 93930 55164.
NTK-335257
ONE SITTING FOR DISCONTINUED STUDENTS
Direct 10th, Inter:- MPC/M.BIPC/ BIPC/ MEC /CEC/ HEC Degree:- BA/BCOM/ BSC / BBA/ BBM/ BCA /B.ED /B.Tech. PG:- M.A / M.COM/ MSC/ MBA / MCA & M.Tech All the courses are recognized under all private & Govt Universities.
Contact No: 9490577501
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189